క్లుప్తంగా

దివ్యాంగులకు తప్పని ఇబ్బందులు



ఏరియా ఆస్పత్రిలో పడిగాపులు కాస్తున్న దివ్యాంగులు, పింఛన్‌దారులు

పాలకొండ రూరల్: పింఛన్ వెరిఫికేషన్‌లో భాగంగా దివ్యాంగులు తమ వైకల్య పునఃనిర్ధారణ పరీక్షల కోసం ఆస్పత్రులకు వచ్చి తీవ్ర అగచాట్లు పడుతున్నారు. గంటల తరబడి దావఖానాలో పడిగాపులు కాస్తున్నారు. వీరఘట్టం మండలం నుంచి దాదాపు 30 మంది దివ్యాంగులు పాలకొండ ఏరియా ఆస్పత్రికి గురువారం చేరుకున్నారు. వైకల్య పరీక్షల నిమిత్తం మండుటెండలో వ్యయ ప్రయాసలకు ఓర్చి ఇక్కడకు చేరుకున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు పరీక్షలు నిర్వహిస్తామని ముందుగా చెప్పిన వైద్యసిబ్బంది ఆ సమయానికి లేకపోవడంతో గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. వారికి తనిఖీలు నిర్వహించాల్సిన వైద్యులు అప్పటికే ఆస్పత్రి నుంచి వెళ్లిపోయినట్లు తెలుసుకున్న దివ్యాంగులు ఉసూరుమన్నారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు రావాలని సిబ్బంది సూచించగా నిరాశతో వెనుదిరిగారు. అసలే వైకల్యం.. ఆపై అంతదూరం నుంచి వస్తున్న తమపై మానవతా దృక్పథంతో వ్యవహరించాల్సిన అధికారులు ఇలా వ్యవహరించడం సమంజసం కాదని పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు.

అన్న సమారాధన



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

గరుగుబిల్లి: స్థానిక శ్రీషిర్డీసాయిబాబా మందిరం వద్ద అన్నసమారాధన కార్యక్రమం గురువారం నిర్వహించారు. అంతకుముందు ఉదయం సుప్రభాతసేవ, బాబాకు విశేష పూజలు చేశారు. అనంతరం వీరఘట్టంకు చెందిన యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎస్ శర్మయాజీ పర్యవేక్షణలో జైగురుదత్త హోమం, శ్రీచక్రార్చనలు, మహాలింగార్చనలు చేపట్టారు.

178 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు

బలిజిపేట: మండలంలోని అరసాడలో డాక్టర్స్ ప్లాజా, ఎన్నార్వై హాస్పిటల్స్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 178మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఎన్నార్వై హాస్పిటల్ వైద్యులు గైనిక్, జనరల్ వ్యాధులు, ఆర్థోపెడిక్ సంబంధిత తనిఖీలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు అభినవ్, మాధురి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘనంగా అమ్మవారి జాతర



గ్రామంలో ఘటాలతో తిరువీధి చేస్తున్న భక్తులతో పూజారి

సీతానగరం: మండలంలోని బూర్జలో పెద్దమ్మవారి జాతరను పురస్కరించుకుని అమ్మవారి ఘటాలకు డప్పువాయిద్యాలతో తిరువీధి జరుగుతోంది. వారం రోజులుగా ఉత్సవాలు జరుగుతున్నాయి. బూర్జలో చిన్న పిల్లలు సైతం ఘటాలను నెత్తిన పెట్టుకుని తిరువీధిలో పాల్గొనడం విశేషం.

రైతులకు ఇబ్బందులు లేకుండా ట్రెంచ్‌లు తీస్తాం



మాట్లాడుతున్న అటవీశాఖ రేంజర్ బి.రామ్‌నరేష్

సీతానగరం: మండలంలోని పేదల భూములకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా ఇక్కడికి కుంకి ఏనుగులను తీసుకువచ్చి మచ్చిక చేసే ఏర్పాటు కొనసాగుతుందని అందు కనుగుణంగా ట్రెంచ్ పనులు జరుగుతున్నాయని అటవీశాఖ రేంజ్ అధికారి బి. రామ్‌నరేష్ అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని అప్పయ్యపేటలో నిర్దేశించిన గ్రామాల వారితో పాటు రైతుసంఘం, సీపీఎం జిల్లా నాయకులతో గురువారం కుంకి ఏనుగుల జోన్ ఏర్పాటుపై అఖిలపక్ష కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న రేంజర్ బి.రామ్‌నరేష్ మాట్లాడుతూ కొండల్లో పంట సాగుభూములకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పనులు కొనసాగిస్తామని తెలియజేశారు. కుంకి ఏనుగులను తెచ్చి ఇక్కడ మచ్చిక చేసే ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు ఎం.కృష్ణమూర్తి, రెడ్డివేణు తదితరులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ భూములు పరిరక్షించండి



ఆక్రమణదారుల నుంచి ప్రభుత్వ భూములు పరిరక్షించాలని గిరిజన సంఘాల నాయకులు ఆరిక చంద్రశేఖర్, రామకృష్ణ, లోవరాజు, సీతారాం, తిరుపతిరావులు కోరుతున్నారు. ఇదే విషయమై వారంతా కలిసి గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రానికి గురువారం వెళ్లి, తహసీల్దారు ఎస్.శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎల్విన్‌పేట, గుమ్మలక్ష్మీపురం పంచాయతీల్లోని చాలా ప్రభుత్వ, గ్రామకంఠం భూములు ఆక్రమణకు గురవుతున్నాయని ఆరోపించారు. ఆక్రమిత ప్రదేశాలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన తహసీల్దారు.. విచారణ చేసి, చర్యలు తీసుకుంటామన్నారు. –గుమ్మలక్ష్మీపురం

● పరామర్శ..



వీరఘట్టం మండలంలోని యు.వెంకమ్మపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సొంట్యాన సింహాచలం తల్లి త్రినాథమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి గురువారం గ్రామానికి చేరుకుని సింహాచలంను పరామర్శించారు. పార్టీ తరఫున అండగా ఉంటామన్నారు. ఆమెతో పాటు జెట్పీటీసీ సభ్యురాలు జంపు కన్నతల్లి ఉన్నారు. – వీరఘట్టం

● పిల్లలను సంరక్షించాలి..



అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులను జాగ్రత్తగా సంరక్షించే బాధ్యత కార్యకర్తలపై ఉందని సీడీపీఓ జి.శాంతిభవానీ అన్నారు. గురువారం స్థానిక కేజీబీవీలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రీ స్కూల్ నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారుల సమగ్ర అభివృద్ధికి బోధన ఉపయోగపడాలన్నారు. పోషణ బి – పడాయి బి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎ. శ్రీనివాసరావు, కేజీబీవీ ప్రిన్స్‌పాల్ భాగ్యవతి, ఎస్‌ఓలు జ్యోతిలక్ష్మి, సవితా పట్నాయక్, కార్యకర్తలుయ పాల్గొన్నారు. –భామిని

పండు.. పోషకాలు మెండు!

గుమ్మలక్ష్మీపురం: వేసవి ఎండలకు జనం బెంబేలెత్తిపోతున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రతకు శరీరంలోని నీరంతా చెమట(స్వేదం) రూపంలో బయటకు పోయి డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. పైగా ఎండల వేడికి ఘనాహారం కన్నా నీటిని లేదా పండ్లు, పండ్లరసాలు తీసుకునేందుకే ప్రజలు ఎక్కువగా ఆసక్తి చూపిస్తారు. ఈ నేపథ్యంలో వేసవిలో లభించే కొన్ని రకాల పండ్లు వాటిల్లో లభించే పోషకాలు, అవి ఏ విధంగా ఆరోగ్యానికి ఉపయోగపడతాయన్న అంశాలపై ప్రత్యేక కథనం..



మార్కెట్‌లో విక్రయిస్తున్న పుచ్చకాయలు

1.ద్రాక్ష..

ద్రాక్ష పండ్లు వేసవి కాలంలో తినడానికి అనువుగా ఉంటాయి. జ్యూస్, సలాడ్‌లలోకి వీటిని ఎక్కువగా వినియోగిస్తారు. జాము, జెల్లీ, సరబత్ వంటి వివిధ రూపాల్లో వీటిని నిల్వ ఉంచుకోవచ్చు. వీటిలో ఔషధ గుణాలు మెండుగా ఉంటాయి. అధిక కేలరీలు, ఎక్కువ మోతాదులో విటమిన్లు కూడా లభిస్తాయి.

ఉపయోగాలు..

ద్రాక్ష పండ్లు గుండె జబ్బులతో బాధపడే వారికి మేలు చేస్తుంది. గుండె నాళాల్లో పేరుకున్న కొవ్వును తగ్గిస్తుంది. మూత్రపిండాలలో, మూత్రాశయంలో ఏర్పడిన రాళ్లను కరిగించడానికి ఇది ఉపయోగపడుతుంది. మూత్రం సాఫీగా రావడానికి కూడా ఉపకరిస్తుంది. ఛక్తాయాసాన్ని ద్రాక్ష రసం తగ్గిస్తుంది. జ్వరంతో బాధపడే వారికి ఉపశమనం కలిగిస్తుంది. రక్త వృద్ధికి ఉపకరిస్తుంది. పళ్లు గట్టిపడడానికి తోడ్పాటునిస్తుంది. పుప్పళ్ల వ్యాధిని నివారిస్తుంది. జీర్ణశక్తిని పెంపొందిస్తుంది.

2.మామిడి..

మామిడి పండ్లను ముఖ్యంగా జామ్, జెల్లీ, తాండ్ర తదితర పదార్థాల తయారీకి ఉపయోగిస్తారు. పచ్చిమామిడి కాయలను పచ్చడి పెట్టడానికి వినియోగిస్తారు. వేసవిలో లభించే ఈ పండులో బీటా కెరోటిన్ పుష్కలంగా ఉంటుంది. చిన్నారులతో సహా అన్ని వయసుల వారు దీనికి తినవచ్చు. దీని ద్వారా లభించే విటమిన్–ఎ కాలేయంలో నిల్వ చేయబడి ఏడాది పొడవునా శరీరానికి కావాల్సిన విటమిన్ల అవసరం తీర్చుకోవచ్చు.

ఉపయోగాలు..

మామిడి పండులో విటమిన్–ఎ, బీటా కెరోటిన్ రూపంలో ఉంటుంది. ఆరోగ్యవంతమైన కళ్లు, చర్మం, పిల్లల ఎదుగుదలకు విటమిన్–ఎ అవసరం. ఇది రక్తనాళాల్లో కొవ్వు పెరగకుండా చూస్తుంది.

3.పుచ్చకాయలు..

వేసవికాలం మొదలవ్వగానే విరివిగా కనబడే ఫలాలు.. పుచ్చకాయలు. ఇది తీగ పంట. ఎక్కువ శాతం నీరు కలిగి ఉంటుంది. దీనిలో తక్కువ కేలరీలు, ఎక్కువ శాతం విటమిన్–సి ఉండడమే కాకుండా దాహాన్ని తీర్చే గుణం దీనికి ఉంటుంది. అధిక ఉష్ణోగ్రత ఉన్న ప్రాంతాల్లో ఈ పంట బాగా పండుతుంది.

వేసవిలో ద్రవాహారం ఉత్తమం..



వేసవి కాలంలో ఎండలు ఎక్కువగా ఉండడం వల్ల శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుంది. ఈ నేపథ్యంలో శక్తి కోసం ద్రవాహారం తీసుకోవడం మంచిది. ఘన పదార్థాల కన్నా ద్రవ ఆహారం ఉత్తమం. సీజనల్ వారీగా లభ్యమయ్యే పండ్లన్నీ తినాలి. అలా అయితేనే మంచి ఆరోగ్యవంతులుగా ఉండగలుగుతాం.

–వై.ఉమాజ్యోతి, శాస్త్రవేత్త, రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం

ఉపయోగాలు..

తక్కువ కేలరీలు కలిగి అధిక విటమిన్లు, ఖనిజ లవణాలు కలిగిన ఈ ఫలం తీసుకుంటే తిన్నది ఏదైనా త్వరగా జీర్ణమవుతుంది. అన్ని వయసుల వారు దీనిని తినవచ్చు. వేసవి ఎండల్లో వేడి అధికంగా ఉన్నప్పుడు కొన్ని ముక్కలతో దాహార్తిని తగ్గించవచ్చు. ఎండ వల్ల వచ్చే జ్వరాన్ని కూడా తగ్గిస్తుంది.

4.కర్బూజ..

దీనినే దోస పండు అని కూడా అంటారు. వేసవిలో పుచ్చకాయలతో పాటు విరివిగా దొరికే పండు ఇది. దీనిలో 90 శాతం నీరు, 5 శాతం చక్కెర ఉంటాయి. దీంతో ఎక్కువగా జ్యూస్, స్క్వాష్‌లు తయారు చేసుకోవచ్చు. గింజల నుంచి నూనెని కూడా తీస్తారు. పండులో చక్కర వేసుకుని, తినడానికి బాగుంటుంది. ఇది బాగా చలవ చేస్తుంది. ఈ పండు తిని బయటకు వెళ్తే శరీరంపై పడే ఎండ ప్రభావం ఎక్కువగా అనిపించదు.

ఉపయోగాలు..

ఎక్కువ నీటి శాతం ఉండడం బరువు తగ్గడానికి ఇది ఉపయోగపడుతుంది. గుండె జబ్బులు, మధుమేహ వ్యాధిగ్రస్తులు కూడా ఇది తినవచ్చు. కర్బూజా పండులో కాల్షియం అధికంగా ఉంటుంది. ఇది ఎముకల పుష్టికి బాగా పనిచేస్తుంది. దీంట్లో ఎక్కువ కూడా అధికంగా లవణాలు ఉంటాయి.

5.నేరేడు..

నోట్లో వేసుకోగానే ఇట్టే కరిగిపోయే ఈ పండు పోషకాల గని. అనారోగ్యాల నివారిణి. నేరేడు శరీరానికి శక్తి ఇచ్చి, ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కొన్ని రకాల రోగాలను నియంత్రించే శక్తి కూడా నేరేడు సొంతం. ఒక్క పండే కాదు ఆకులు, బెరడు కూడా శరీరానికి ఎంతో మేలు చేస్తాయి.

ఉపయోగాలు..

పిండి పదార్థాలు, కొవ్వు భయం ఉండదు. కనుక నేరేడు పండ్లను అధిక బరువు ఉన్న వారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు కూడా వీటిని రోజుకు ఆరు నుంచి ఎనిమిది వరకు తినవచ్చు. చాలాకాలంగా కడుపులో పేరుకుపోయిన మలినాలను బయటకు పంపడానికి ఇవి తినడం మంచిది. నేరేడు పండ్లు శరీరానికి చలవ కూడా చేస్తాయి. దీర్ఘకాల వ్యాధుల నివారణకు, రోగ నిరోధక శక్తి పెంచడానికి, మూత్ర సంబంధిత సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. నీరసం, నిస్సత్తువ ఉన్న వారు నేరేడు పండు తింటే తక్షణమే శక్తి లభిస్తుంది. వెన్ను, నడుము, మోకాళ్ల నొప్పులు నయమవుతాయి.

6.కొబ్బరి నీళ్లు..

ఎండ వేడిమిని తట్టుకోవడానికి బెస్ట్ రిఫ్రెష్‌మెంట్ డ్రింక్ కొబ్బరి నీళ్లు. కొబ్బరి నీళ్ల వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. డీహైడ్రేషన్, ఎండ వేడిని తగ్గిస్తుంది. కొబ్బరి నీళ్లలో 94 శాతం నీరు ఉంటుంది. కొవ్వు చాలా తక్కువగా ఉంటుంది. 250 ఎం.ఎల్ కొబ్బరి నీటిలో 9 గ్రాముల పిండి పదార్థం, 3 గ్రాముల ఫైబర్, 2 గ్రాముల ప్రోటీన్, 10 శాతం విటమిన్–సి, 15 శాతం మెగ్నీషియం, 17 శాతం మాంగనీస్, 17 శాతం పోటాషియం, 11 శాతం సోడియం, 6 శాతం కాల్షియం ఉంటుంది. ఈ నీళ్లు తాగితే శరీరంలోని వ్యర్థ పదార్థాలు తొలగింపబడతాయి. యాంటీ ఆక్సిడెంట్లు మెండుగా ఉండడం వల్ల కాలేయం ఆరోగ్యం ఉండడంలో తోడ్పడుతుంది. పేగు కదలికలను సులభతరం చేస్తుంది. జీర్ణక్రియకు మేలు చేస్తుంది. మలబద్ధకం సమస్యను దూరం చేస్తుంది. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. గుండె జబ్బులు వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

పందిరి కూరగాయల పెంపకంతో లాభాలు

● డీహెచ్ఓ శ్యామల

సీతంపేట: పందిరి కూరగాయల పెంపకంతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యానవన శాఖాధికారి (డీహెచ్ఓ) శ్యామల అన్నారు. మండలంలోని కోసంగిలో జీలకర్ర మధుసూదనరావు సాగు చేస్తున్న పందిరి కూరగాయలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెరటిలో కూరగాయలు పెంచడం వల్ల ఇంటి అవసరాలు తీరుతాయని చెప్పారు. రైతు సొంతంగా మామిడి అంట్లు కడుతుండడంతో వీటిపై రైతులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పసుపుతో పాటు ముఖ్యమైన పంటలన్నీ ప్రకృతి వ్యవసాయంలో పండించుకోవాలని సూచించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలన్నారు. ఈమె వెంట స్థానిక హార్టికల్చర్ ఆఫీసర్ పేడాడ జయశ్రీ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాలకొండ రూరల్: టౌన్–2 ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ టీజీకే.మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఇందిరానగర్, గారమ్మకాలనీ, వడమ కాలనీ, రాజాం రోడ్డు, మున్సిపల్ కార్యాలయ చుట్టుపక్కల ప్రాంతాల్లో, తుమరాడ పరిసరాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

25న షాపులకు వేలంపాట



పంచాయతీ షాపులు

వీరఘట్టం: మేజర్ పంచాయతీ పరిధిలోని అంబేడ్కర్ జంక్షన్‌లో గల ఆరు షాపులు, రెండు ప్లాట్లు..అలాగే పంచాయతీ కార్యాలయానికి ఎదురుగా ఉన్న ఎనిమిది షాపులను అద్దెకు ఇచ్చేందుకు ఈ నెల 25న బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఈఓ బి. కోటేశ్వరరావు గురువారం తెలిపారు. అలాగే డైలీ మార్కెట్, కారు/బస్టాండ్ ఆశీల వసూలుకు కూడా అదే రోజు పంచాయతీ కార్యాలయం వద్ద వేలం నిర్వహించనున్నట్లు చెప్పారు. వేలంపాటలో పాల్గొనే వారు రూ. లక్షకు సాల్వెన్సీ సర్టిఫికెట్ అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు కార్యాలయం పని వేళల్లో సంప్రదించాలన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ శతశాతం పూర్తి చేయండి



ఫార్మర్ రిజిస్ట్రీ వివరాలు పరిశీలిస్తున్న ఎ.డి రత్నకుమారి

పాలకొండ: రైతులకు గుర్తింపు కార్డుల జారీ కోసం చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ శతశాతం పూర్తి చేయాలని వ్యవసాయశాఖ ఎ.డి రత్నకుమారి తెలిపారు. మండలంలోని కొండాపురం ఆర్‌ఎస్‌కేను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఇంతవరకు చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రీని పరిశీలించారు. అనంతరం ఆమె రైతులతో మాట్లాడుతూ.. ప్రతి రైతూ తమ పొలాలకు సంబంధించి భూధార్ విధిగా చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ సలహాల కోసం తమ సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ పి. నీలిమ పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి డంపింగ్‌యార్డు సమస్య

● ఎమ్మెల్సీ విక్రాంత్



ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: పాలకొండ నగర పంచాయతీకి సంబంధించిన డంపింగ్ యార్డు సమస్యను మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ దృష్టికి తీసుకువెళ్లామని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ తెలిపారు. పట్టణంలో డంపింగ్ యార్డు లేకపోవడంతో ఏర్పడుతున్న సమస్యను రాత పూర్వకంగా వివరించామన్నారు. ఈ మేరకు ఆయన గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గతంలో మండలంలోని టీడీ పారాపురం గ్రామం వద్ద ఐదెకరాల స్థలాన్ని డంపింగ్ యార్డు కోసం కేటాయించిందన్నారు. యార్డు పనులు చేపడుతున్న సమయంలో స్థానిక ప్రజలు అడ్డుకోవడంతో పనులు నిలిచిపోయాయని తెలిపారు. ప్రస్తుతం రోజుకు పది టన్నుల చెత్త పట్టణం నుంచి వస్తోందని, దీన్ని ఎక్కడ వేయాలో తెలియక నగర పంచాయతీ అధికారులు తలలు పట్టుకుంటున్నారన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించి యార్డుకు స్థలం కేటాయిస్తే సమస్య పరిష్కారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సీసీ కెమెరాల ఏర్పాటుపై దృష్టి

పాలకొండ రూరల్:

వ్యాపార సముదాయాలు, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్సై కె. ప్రయోగమూర్తి అన్నారు. మండల కేంద్రంలోని వర్తకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుకోని సంఘటనలు చోటుచేసుకున్నప్పుడు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ఓ సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమన్న విషయాన్ని గుర్తించి వర్తకులు వీటిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

● సీడీపీఓ సిమ్మాలమ్మ



మాట్లాడుతున్న సీడీపీఓ సిమ్మాలమ్మ

పాలకొండ రూరల్: అంగన్‌వాడీ సిబ్బందికి అందిస్తున్న శిక్షణలను సద్వినియోగం పరుచుకోవాలని సీడీపీఓ బి. సిమ్మాలమ్మ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంతో పాటు ఐసీడీఎస్ కార్యాలయంలో పోషణ–బి – పడాయి–బి కార్యక్రమంపై శిక్షణ అందించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల ఆరోగ్య స్థితిగతుల మెరుగు, రక్తహీనత అధిగమించడం, పోషకాహారాన్ని ఏవిధంగా అందించాలో అనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పి. దశారత్నం, టి.మేరీ, బి. వసుంధర, త్రివేణి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ అరుణజ్యోతి, తదతరులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి

గుమ్మలక్ష్మీపురం: స్థానిక వెలుగు, ఎంపీడీవో కార్యాలయాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తున్న పోషణ్ బీ పడాయి బీ శిక్షణ కార్యక్రమంపై మూడు రోజుల శిక్షణా తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ నిర్వహణ సక్రమంగా చేయాలని, చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం క్రమం తప్పకుండా అందివ్వాలని ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ: స్థానిక జూనియర్ కళాశాలలో పోషణ్ బీ పడాయి బీ కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందివ్వడంతో పాటు సక్రమంగా పౌష్టికాహారం అందివ్వాలని ఐసీడీఎస్ పీవో సుగుణ తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎల్.శారదబాంబ, అరుణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కొమరాడ: అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలిస్తున్న పీవో సుగుణకుమారి

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఎన్‌ఎంయూ నాయకులు

పాలకొండ రూరల్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎన్‌ఎంయూ పాలకొండ డిపో కార్యదర్శి వావిలిపల్లి రాజేష్ అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక డిపో ఎదుట ఎర్ర బ్యాడ్జీలను ధరించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా డిపోలో మహిళా ఉద్యోగులను సన్మానించిన యాజమాన్యం ఎన్‌ఎంయూ మహిళా ఉద్యోగులను పక్కన పెట్టడం సరికాదన్నారు. అన్ని కేటగిరీల్లో ఉన్న ఖాళీలను అనుసరించి ఉద్యోగోన్నతులు కల్పించాలని, ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె. శంకరరావు, డిపో అధ్యక్షుడు ఎస్‌టీ రావు, మద్ది సుబ్బారావు, వైకుంటరావు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన సదస్సులు



నవోదయం సదస్సులపై మాట్లాడుతున్న సూర్యకుమారి

పాలకొండ: మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామని ఎక్సైజ్ సీఐ సూర్యకుమారి తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్ బాలమురళీకృష్ణ, ఎస్సై ప్రయోగమూర్తిలతో కూడిన బృందం గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నవోదయం–2 కార్యక్రమం నిర్వహణ కోసం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సారా అమ్మకాలు చేపడుతున్న గ్రామాలను గుర్తించి అవగాహన కలిగించందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణంలోని రెల్లివీధిలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తించామని తెలిపారు. ఆ ప్రాంతంలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు.

పొజిషన్ సర్టిఫికెట్లు అందించండి



తహసీల్దారుతో మాట్లాడుతున్న హౌసింగ్ ఈఈ సోమేశ్వరరావు

గరుగుబిల్లి: గృహనిర్మాణదారులకు త్వరితగతిన పొజిషన్ సర్టిఫికెట్లు అందించాలని హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమేశ్వరరావు.. తహసీల్దారు పి.బాలను కోరారు. ఇదే విషయమై ఆయన మండల తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారును గురువారం కలిశారు. గ్రామీణ ప్రాంతాల్లో గృహ నిర్మాణాలు ప్రారంభించాల్సి ఉన్నందున లబ్ధిదారులకు నిర్మాణానికి అవసరమైన పొజిషన్ సర్టిఫికెట్లతో పాటు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు వెంటనే ఇవ్వాలన్నారు. ఆయన వెంట ఏఈ వి.అఖిల్, ఆర్ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా నిర్మాణాలు



చిన్న దిమిలిలో స్కూల్ ప్రహరీ నిర్మాణం పరిశీలిస్తున్న ఎంపీడీఓ సత్యం, ఏపీఓ బాబూరావు

భామిని: ఉపాధి హామీ పథకంలో భాగంగా మంజూరైన స్కూల్ ప్రహరీలు, గోశాలల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ కొండపల్లి సత్యం, ఏపీఓ రేగిడి బాబూరావు అన్నారు. ఈమేరకు మండలంలోని కొరమ, చిన్నదిమిలి, దిమ్మిడిజోల గ్రామాల్లో జరుగుతున్న పనులను గురువారం వారు పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ.. పనులు త్వరగా పూర్తి చేస్తే బిల్లులు త్వరగా చెల్లిస్తామన్నారు. పరిశీలనలో టీఏ తేజ, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.